క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం.. దక్షిణాయనం మార్గశిర మాసం రోహిణి నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం.. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

యువత చెడు మార్గం విడనాడాలి

చీరాల రూరల్: నేటి తరం యువతి, యువకులు చెడు మార్గాలను విడనాడి సన్మార్గంలో నడవాలని రెవరెండ్ గోదా చంద్రకాంత్ అన్నారు. స్థానిక జాన్‌పేటలోని సెయింట్ జాన్స్ ప్యారిష్ చర్చిలో యూత్ బైబిల్ కాంపిటిషన్స్ శనివారం ఘనంగా నిర్వహించారు. ఏఈఎల్‌సీకి చెందిన గుంటూరు ఫీల్డ్‌లోని అన్ని లూథరన్ చర్చిలకు చెందిన యువతీ యువకులు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల నుంచి విచ్చేసిన యూత్ సభ్యులకు నిర్వాహకులు బైబిల్ రీడింగ్, ఎలక్యూషన్, ఫజిల్, దేవుని గీతాలాపనలు, నృత్యాలు వంటి పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన యువతీ యువకులకు నిర్వాహకులు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. యూత్ సభ్యులు, విశ్వాసులు అధిక సంఖ్యలో యువతి, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవునికి స్నపన తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి

యద్దనపూడి: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో క్రోధి నామ సంవత్సర ధనుర్మాస ప్రారంభ స్నపన తిరుమంజన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు, యాజ్ఞికులు వెంకట సందీప్ దీక్షిత్, సంపత్‌కుమార్, మురళీకృష్ణ, అనీల్‌కుమార్ బృందం స్వామివారికి ఆగమోక్తంగా పూజా క్రతువు నిర్వహించారు. అనంతరం శాంతిహోమ పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తిరుమలనాథస్వామికి విశేష పూజలు



పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామ సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి దేవాలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు శనివారం చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవారికి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కలగాలని ఆలయం వెనకాల ఉన్న గిరికొండ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని వారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇసుకే పరమాన్నం



ఈపురుపాలెంలో ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక



బోయినవారిపాలెం ఇసుక భూముల్లో అనుమతి లేకుండా తవ్వుతున్న దృశ్యం

- ఇసుక అక్రమరవాణాలో చీరాల రూటే సపరేటు
- అక్రమార్కుడైన రాజేశ్వరుడి జోలికి వెళ్లని యంత్రాంగం
- వేలాది ట్రాక్టర్లు, టైరు బండ్లలో తరలింపు

చీరాల టౌన్ : చీరాల మండలంలో ఇసుక దోపిడీ పర్వం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా మారింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఇసుకను ఇష్టారీతిన తవ్వి కోట్లుకు పగడలెత్తుతున్నారు. కళ్లెదుటే రోజుకు వందలాది ట్రాక్టర్లు, టైరు బండ్లలో తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమార్కుడు రాజేశ్వరుడి (ఓ ముఖ్య నేత బినామీ)కి అధికార పార్టీ ముఖ్యనేత అండగా నిలవడంతో ఇసుక అక్రమ రవాణా పెట్రేగిపోతోంది. ఇసుక తవ్వడంతో భూములు చెరువుల్లా మారి పర్యావరణ సమతుల్యత దెబ్బతిని ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రకృతిని ఫణంగా పెట్టి మరీ ఇసుక తవ్వకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి వారికి సహకరించేలా అన్ని శాఖల అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇసుక డాన్‌గా పేరొందిన రాజేశ్వరుడే ఇదంతా చేస్తున్నాడని అధికారులకు తెలిసినప్పటికీ ఆమ్యామ్యాలకు అలవాటు పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఇసుక అక్రమ రవాణా ఆరు ట్రాక్టర్లు...అరవై ఆరు టైరు బండ్లతో లక్షలు కురిపిస్తోంది. ఈ దందాకు కేంద్రంగా ఉన్న చీరాల, వేటపాలెం మండలాల్లో ఈ దందా కొనసాగుతోంది. రెవెన్యూ, మైనింగ్ శాఖలు నామమాత్రపు చర్యలు కూడా తీసుకోవటం లేదు. చీరాల మండలంలోని బోయినవారిపాలెం గ్రామశివారు, పాతచీరాల, గవినివారిపాలెం, తోటవారిపాలెం, కొత్తపాలెం, తదితర ప్రాంతాల్లో రాజేశ్వరుడు కొంత కాలంగా అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్నాడు. ఎటువంటి అనుమతి లేకుండా ట్రాక్టర్లు, టైరుబండ్లలో రేయింబవళ్లు తరలిస్తున్నాడు. గ్రామాల్లో ట్రాక్టర్లు తిరగడంతో రోడ్లు ఛిద్రం కావడంతో పాటు గ్రామంలోని రోడ్లపై నడవాలంటే ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అక్రమార్కులు తీరప్రాంతాన్ని దశాబ్ద కాలంగా పదుల కొద్దీ మీటర్ల లోతున తవ్వేశారు. అప్పుడప్పుడూ రోడ్లపై కనిపించే ట్రాక్టర్లను ఆపి జరిమానాలు విధించి మమ అనిపించటం మినహా ఇసుక క్వారీల వద్దకు వెళ్లి ఇసుక తవ్వుతున్న పొక్లెయిన్‌లను, ట్రక్కులను సీజ్ చేసి అక్రమ తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులను అరెస్ట్ చేయటం లేదు. ప్రస్తుతం కూటమి సర్కార్ పాలనలో 24 గంటలు మద్యం.. 24 గంటలు ఇసుక విస్తృతంగా లభిస్తోంది. టీడీపీ నాయకులకు కాసులు కురిపిస్తోంది.

చర్యలు తీసుకుంటాం

ఇసుక అక్రమ రవాణాపై చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర నాయుడును వివరణ కోరగా నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల తహసీల్దార్లకు ఆదేశాలిచ్చామన్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించామని.. క్వారీలను పోలీసుల సాయంతో తనిఖీలు చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. నిబంధనలు అతిక్రమించి రవాణా చేసే వాహనాలకు చలానాలు విధిస్తామని చెప్పారు.

నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

అద్దంకి: నియోకవర్గంలో 35 మేజర్ ఇరిగేషన్, 14 సప్లయ్ చానల్ సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఐదు మండలాల్లో ఈ ఎన్నికలు జరిగాయి. మొత్తం 49 సంఘాలకు సంబంధించి 49 ప్యానెళ్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్ఎస్పీ అధికారి రామకృష్ణ తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

పర్చూరు(చినగంజాం): పర్చూరు నియోజకవర్గ పరిధిలో ఎన్ఎస్పీ 4 డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలోని 24 సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలోని కృష్ణ వెస్ట్రన్ డెల్టాలోని 14 సాగు నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక శనివారం నిర్వహించినట్లు అధికారులు వివరించారు.

చీరాలలో ఏకగ్రీవం

చీరాల టౌన్: సాగునీటి సంఘాల ఎన్నికలు చీరాల్లో శనివారం ప్రశాంతతంగా జరిగాయి. కూటమి నాయకులు ఏకగ్రీవం చేయించుకున్నారు. మొత్తం నాలుగు సంఘాలు ఏకగ్రీవం అయ్యాయి. వేటపాలెం మండలంలో మొత్తం నాలుగు నీటి సంఘాల్లో కూడా ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా రేపు

మార్టూరు: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాలో రైతులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని మండల రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివరావు, కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సుదీర్ఘకాలంగా రైతు సమస్యలపై పోరాడుతున్న ఢిల్లీ రైతుల ఉద్యమ స్ఫూర్తితో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, రికార్డుల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని, అన్నదాత సుఖీభవ వెంటనే విడుదల చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలనే తదితర సమస్యలపై చర్చిస్తామన్నారు.

పేదలతో ప్రేమగా ఉండాలి



పేదలకు బట్టలు అందిస్తున్న కళ్యాణరావు కుటుంబ సభ్యులు

చినగంజాం: పేదల పట్ల ప్రేమ, ఆదరాభిమానాలు కలిగి ఉండాలని అది దేవునికి ఆమోదయోగ్యం అని క్రిస్మస్ క్యారెల్స్ నిర్వాహకుడు మేకల మేషక్ బాబు అన్నారు. శనివారం క్రిస్మస్ పండగను పురస్కరించుకొని చినగంజాం అంబేడ్కర్ నగర్‌లో జరుగుతున్న క్యారెల్స్ కార్యక్రమంలో మాట్లాడారు. అంబేడ్కర్ నగర్‌కు చెందిన బొల్లా రామకోటయ్య సతీమణి క్యారెల్స్ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న చిన్నారులకు స్నాక్స్, హార్లిక్స్‌తో కూడిన బలవర్ధకమైన పాలు అందజేసింది. దైవసేవకులు మార్పు కళ్యాణరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి రాణి, కుమార్తె విశ్రాంతమ్మ, కుమారుడు యెహోషువా అంబేడ్కర్ నగర్‌కు చెందిన పేదలు చల్లా బాలస్వామికి బట్టలు, మేడికొండ కుమారికి బట్టలు, 10 కేజీల బియ్యం అందజేశారు. కారక్రమంలో చిన్నారులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం



చీరాల: జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ,



అద్దంకి: లోక్‌ఆదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

చీరాల రూరల్: కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని.. రాజీ మార్గమే రాజ మార్గమని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కం సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి సుధ మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకున్నట్లయితే.. సమయంతో పాటు డబ్బు కూడా ఆదా చేసుకోవచ్చునని సూచించారు. వాదులు, ప్రతివాదులు ఇద్దరూ గెలిచినట్లేనని అంతేకాక వారి మనస్సులో ఎటువంటి కక్షలు, కార్పణ్యాలకు తావుండదని చెప్పారు. లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులే అంతిమ తీర్పులని వాటిపై ఇతర కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవకాశం లేదని పేర్కొన్నారు. అలానే మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

1249 కేసుల పరిష్కారం

స్థానిక కోర్టు భవన సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1249 కేసులు పరిష్కరించారు. వాటిలో క్రిమినల్ కేసులు 1226, సివిల్ కేసులు 14, చెక్‌బౌన్స్ కేసులు 7, భరణం కేసులు 2 పరిష్కరించారు. మూడు బెంచ్‌లుగా ఏర్పాటు చేసిన ఈ అదాలత్‌లో ప్రిసైడింగ్ అధికారులుగా సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ నిషాద్ నాజ్‌లు వ్యవహరించారు. అదాలత్ మెంబర్లుగా న్యాయవాదులు ఎ. కొండమ్మ, ఎ. రామకృష్ణారెడ్డి, జి. స్నేహ, పారా లీగల్ వలంటీర్లు ఎస్కే మహబూబ్ సుభాని, ఎస్‌డీ మతిన్, జేవీ సాయికృష్ణ వ్యవహరించారు. అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

1305 కేసులు

అద్దంకి రూరల్: అద్దంకి కోర్టు సముదాయాల్లో శనివారం నిర్వహించిన లోక్ ఆదాలత్ లో 1305 కేసులు పరిష్కారం అయినట్లు సీనియర్ సివిల్‌జడ్జి డి. నాగ వెంకటలక్ష్మి తెలిపారు. వాటిలో క్రిమినల్ కేసులు 160, ఎగ్జిక్యూటివ్ పిటిషన్ కేసులు 3, ఒరిజినల్ మనీ సూట్‌లు 3, ఎక్సైజ్ కేసులు 185, గృహహింస కేసులు 3, చెక్‌బౌన్స్ కేసులు 7, సమ్మరీ ట్రైల్ కేసులు 900 మేర రాజీ అయ్యాయి. రాజీయే రాజ మార్గమని లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పులు అంతిమ తీర్పులని న్యాయమూర్తి పేర్కొన్నారు. రెండు బెంచ్‌లుగా ఏర్పాటు చేసిన అదాలత్‌కు మొదటి బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి డి. నాగ వెంకటలక్ష్మి ప్రిసైడింగ్ అధికారిగా, రెండో బెంచ్‌కు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నూతక్కి శ్రావణి ప్రియదర్శిని ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. లోక్ అదాలత్ సభ్యులుగా న్యాయవాదులు షేక్ మహమ్మద్ రఫీ, ఆకుల సత్యవతి, టి. మార్తా శ్రీను, డి. హయగ్రీవాచారి వ్యవహరించారు.

పాపుల రక్షణకే క్రీస్తు జననం



వృద్ధులకు వీల్‌చైర్‌లు అందిస్తున్న మాజీ ఎంపీ జేడీ శీలం

పర్చూరు (చినగంజాం): మానవులను పాపాల నుంచి పరిశుద్ధులుగా చేసేందుకే ఏసుక్రీస్తు ఈ లోకంలో జన్మించారని మాజీ ఎంపీ జేడీ శీలం అన్నారు. మండలంలోని నూతలపాడు గ్రామంలోని కవనెంట్ చర్చి నిర్వాహకులు పాస్టర్ జూపూడి మార్క్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు, ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వై. సతీష్ కుమార్ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీ జేడీ శీలం మాట్లాడుతూ శాంతి, సమాధానం అనుగ్రహించడానికి ఏసుక్రీస్తు మానవుడిగా ఈ లోకంలో అవతరించాడని తెలిపారు. పాస్టర్ కంచర్ల ఏసు రత్నం సౌజన్యంతో వికలాంగులకు రెండు వీల్ చైర్‌లు మాజీ ఎంపీ అందజేశారు. పాస్టర్ సుధాకర్, రెవరెండ్ డాక్టర్ చిట్టిబాబు, జీవరత్నం, డి. ప్రేమయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాగర హారతి



తీరం ఒడ్డున స్పటిక శివునికి ప్రత్యేక పూజలు చేస్తున్న స్వామీజీ

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు సముద్ర తీరం ఒడ్డున ఆంజనేయస్వామి విగ్రహం వద్ద హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని సాగర హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య తీరం ఒడ్డున శివునికి ప్రత్యేక పూజల అనంతరం శాస్త్రోక్తంగా సాగర హారతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా ధర్మదేవత బిరుదాంకితుడు శైవక్షేత్ర పీఠాధిపతులు.. తాళ్లపాలెం శివస్వామీజీ హాజరై స్పటిక శివలింగానికి ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించి సాగర హారతిని అందించారు. స్వామీజి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ భక్తి కలిగి ఉండి ఆధ్యాత్మికతతో జీవించాలన్నారు. జనవరి 5న విజయవాడలో జరిగే హిందూ శంఖారావానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అర్చకులు కారంచేటి నగేష్‌కుమార్, కార్తీక్ శర్మ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఏర్పాట్లను హిందూ చైతన్య వేదిక ప్రముఖ్ తాడివలస దేవరాజ్, బి.జ్వాలా, పిక్కి నారాయణ, గురవయ్య, రామకృష్ణ, శబరి గుప్తా, భవానీ పర్యవేక్షించారు.



హారతి ఇస్తున్న దృశ్యం



వాదరేవు తీరంలో మాట్లాడుతున్న శివస్వామి



కార్యక్రమానికి హాజరైన భక్తులు